

మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్

బోనాల ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

చిక్కడపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): బోనాల ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎంపీ ఎం. అనిల్‌కుమార్ యాదవ్ కోరారు. బల్కంపేట ఎల్లమ్మ దేవాలయంలో అమ్మవారి కల్యాణాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ నగర ఉపాధ్యక్షుడు గుర్రం శంకర్, చంద్రకళ ఆధ్వర్యంలో మంగళవారం గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్‌లో రేణుక ఎల్లమ్మకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పేద మహిళలకు ఉచితంగా చీరలు పంపిణీ చేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్‌యాదవ్, సీనియర్ నాయకులు అభిషేక్ కెనడీ, మారిశెట్టి నర్సింగ్ రావు, రాజశేఖర్, మీనా తదితరులు పాల్గొన్నారు.



ఎల్లమ్మ కల్యాణంలో కార్పొరేటర్ జి. రచనశ్రీ తదితరులు

వైభవంగా ఎల్లమ్మ కల్యాణం

కవాడిగూడ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సింగాడికుంట ఎల్లమ్మ నాగదేవత ఆలయంలో మంగళవారం ఎల్లమ్మ కల్యాణం వైభవంగా నిర్వహించారు. కవాడిగూడ కార్పొరేటర్ జి రచనశ్రీ, బీఆర్ఎస్ నాయకుడు ముఠా జైసింహ, బీజేపీ రాష్ట్ర నాయకుడు జి. వెంకటేష్, బీజేపీ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎంసీ మహేందర్‌బాబు. ఎ. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఆలయాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలి

రాంనగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): బోనాల పండుగ నేపథ్యంలో అమ్మవారి ఆలయాల వద్ద జీహెచ్ఎంసీ అధికారులు మౌలిక సదుపాయాలు కల్పించాలని రాంనగర్ కార్పొరేటర్ కె. రవిచారి డిమాండ్ చేశారు. బాగ్‌లింగంపల్లిలోని ఎల్ఐసీ క్వార్టర్స్‌లోగల శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం ఆయన పూజలు చేశారు.

బస్తీ దవాఖానాల్లో అందుబాటులో అన్ని మందులు

బర్కత్‌పుర, జూలై 9 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట సర్కిల్ 16 పరిధిలోని బస్తీ దవాఖానాల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచుతున్నట్లు డీఎంసీ మారుతీ దివాకర్ తెలిపారు. మంగళవారం సర్కిల్ పరిధిలోని పలు బస్తీ దవాఖానాలను సందర్శించి అందుబాటులో ఉన్న మందుల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు బస్తీ దవాఖానాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జనవరి నుంచి ఇప్పటి వరకు సర్కిల్ పరిధిలో 40 మంది డెంగీ వ్యాధి బారినపడ్డారని తెలిపారు. రోడ్లపై చెత్త వేస్తే వెయ్యి రూపాయల జరిమానా విధిస్తామని డీఎంసీ హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో హేమలత తదితరులు పాల్గొన్నారు.



బస్తీ దవాఖానాను సందర్శించిన డీఎంసీ మారుతీ దివాకర్, ఏఎంహెచ్‌వో హేమలత



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రజక ధోబీ అభివృద్ధి సంస్థ గ్రేటర్ చైర్మన్ ఎం. నర్సింహ, రాష్ట్ర నాయకులు

ధోబీఘాట్లలో ఉచిత కరెంట్ పథకం అమలు చేయాలి

కవాడిగూడ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రజక బస్తీలో, ధోబీఘాట్లలో ఉచిత కరెంట్ పథకం అమలు చేయాలని, రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని, సమస్యలు పరిష్కరించాలని రజక ధోబీ అభివృద్ధి సంస్థ గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ ఎం నర్సింహ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపల్లి రాజశేఖర్, రాష్ట్ర కార్యదర్శి చుక్కన్న కోరారు. మంగళవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రజక కాలనీలు. ధోబీఘాట్‌లలో కరెంటు బిల్లులు కట్టడం లేదని కనెక్షన్‌లు కట్ చేస్తామని అధికారులు బెదిరిస్తున్నారని మంత్రి దృష్టి తీసుకెళ్లారు. ట్యాంక్‌బండ్‌పై చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో రజక ధోబీ అభివృద్ధి సంస్థ ప్రధాన కార్యదర్శులు బి. చంద్రమోహన్, కిషన్, సుధాకర్ తదితరులు ఉన్నారు.



గౌడ మ్యారేజ్ బ్యూరోలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

మ్యారేజ్‌బ్యూరోలకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

రాంనగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మ్యారేజ్ బ్యూరోలు నిర్వహిస్తున్న వారికి ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గౌడ మ్యారేజ్‌బ్యూరో మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తెలంగాణ ఆవిర్భావం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన పలు మ్యారేజ్ బ్యూరో సంస్థలకు సర్టిఫికెట్‌లు, గుర్తింపు కార్డులు అందజేశారు. కార్యక్రమంలో గౌడ మ్యారేజ్‌బ్యూరో మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గడ్డమీది హరినాథ్‌గౌడ్, గౌడ హాస్టల్ అధ్యక్షులు చక్రపాణిగౌడ్, దర్గా చిన్నగౌడ్, కోశాధికారి మెరుగు కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు

నల్లకుంట/గోల్నాక, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మాతృమూర్తి పేరిట మొక్క నాటాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం నల్లకుంటలో బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర మీడియా కన్వీనర్ ఎం. ఐజాక్‌రాజ్ మొక్కలు నాటారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు.

● బీజేపీ గోల్నాక డివిజన్ అధ్యక్షుడు మూల రవీందర్‌గౌడ్ తల్లి సుమిత్రతో కలిసి ఖాద్రీబాగ్‌లో తన నివాస ప్రాంగణంలో మంగళవారం మొక్క నాటారు. కార్యక్రమంలో బీజేవైఎం సెంట్రల్ జిల్లా కార్యదర్శి ఎస్. శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న ఐజాక్ రాజ్

ఆటో, మోటార్ వర్కర్స్‌కు

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

చిక్కడపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఆటో, మోటార్ వర్కర్స్‌కు సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఉదయం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని తెలంగాణ కార్మిక కమిషనరేట్ ఎదుట ప్రోగ్రెసివ్ ఆటో, మోటార్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె. సూర్యం, నగర అధ్యక్షురాలు ఎస్ఎల్ పద్మ, యూనియన్ అధ్యక్షుడు వి. ప్రవీణ్ మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకంతో నష్టపోతున్న ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని, ఆటో మెయింటెనెన్స్ కోసం ఇస్తామన్న సంవత్సరానికి రూ. 12 వేలు వెంటనే ఇవ్వాలని, ఓలా, ఉబర్ సంస్థలను నిషేధించాలని, ప్రభుత్వమే ప్రత్యేక యాప్ ద్వారా ఉచితంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్మికశాఖ రాష్ట్ర అదనపు కమిషనర్ డా. ఇ గంగాధర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు అఫ్జల్, కృష్ణముదిరాజ్, రవీందర్, నారాయణ, నిస్సార్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



కార్మికశాఖ కమిషనరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆటో, మోటార్ వర్కర్స్ యూనియన్ నాయకులు, కార్మికులు

డ్రైవర్స్‌కు..

రాంనగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లక్షలాది మంది ఉన్న డ్రైవర్ల సంక్షేమం కోసం డ్రైవర్స్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐఆర్టీడబ్ల్యూఎఫ్ నగర కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞానకేంద్రంలో రవాణా రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నగర కార్యదర్శి కె. అజయ్‌బాబు అధ్యక్షతన సమావేశం జరిగింది.

ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. డ్రైవర్లపై చలాన్లు, పెనాల్టీలు, యూజర్ చార్జీలు వంటివి విధిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు కె. సతీష్, కె. గోపాల్‌రెడ్డి, జనార్దన్, ముఖేష్, శర్మ తదితరులు పాల్గొన్నారు.

అందరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి : ఎమ్మెల్యే

ముషీరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంపట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహిచాలని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. మంగళవారం రాంనగర్ ప్రేయర్‌పవర్ చర్చిలో ముషీరాబాద్ కేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వంతోపాటు ప్రైవేటు, కార్పొరేట్ వైద్య సంస్థలు సామాజిక బాధ్యతతో పేద, మధ్యతరగతి ప్రజలు నివసించే ప్రాంతాలలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. శిబిరానికి హాజరైన వారిని వైద్యులు పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు.

కార్యక్రమంలో ఆలిండియా ప్రేయర్‌పవర్ చర్చిల డైరెక్టర్ శ్యామ్ అబ్రహాం, కన్వీనర్ బ్రణహం, బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహ, శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్‌కుమార్, ముచ్చకుర్తి ప్రభాకర్, శ్రీధర్‌చారి, కేర్ ఆస్పత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ అబ్దుల్ నఫీ, వైద్యులు మొహినొద్దీన్, సయ్యద్ అబ్దుల్ అలీం, స్వాతి, ఆనంద బాబు, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

భవిత సెంటర్‌లో వైద్య శిబిరం

జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, నవభారత లయన్స్ క్లబ్ సంయుక్తాధ్వర్యంలో ముషీరాబాద్‌లోని ప్రభుత్వ భవిత సెంటర్ (మానసిక దివ్యాంగుల పాఠశాల)లో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు.

డాక్టర్ జి. మహేందర్‌కుమార్‌రెడ్డి చిన్నారులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్ భవిత కేంద్రానికి రూ. 10 వేల విలువ చేసే వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో సరోజిని రామారావు, కృష్ణవేణి, జ్యోతి రాజా, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాలుర హాస్టల్‌ను తనిఖీ చేసిన కలెక్టర్



అన్నంను పరిశీలిస్తున్న కలెక్టర్

అంబర్‌పేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అంబర్‌పేటలో బాలుర హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థి సంఘాల నేతలు సమస్యలను ఇటీవల కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా మంగళవారం హాస్టల్‌కు వచ్చి విద్యార్థులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. సమస్యలు పరిష్కరించాలని వార్డెన్‌ను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ శాఖ డీడీ ఆశన్న, పలువురు అధికారులు పాల్గొన్నారు.

'ప్రైవేట్ యాప్స్‌పై ప్రభుత్వ నియంత్రణ ఉండాలి'

చిక్కడపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పోర్టర్, నో బ్రోకర్ వంటి ప్రైవేట్ యాప్స్‌పై ప్రభుత్వ నియంత్రణ ఉండాలని, ఐదు శాతానికి మించి కమీషన్ వసూలు చేయొద్దని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. శ్రీకాంత్ డిమాండ్ చేశారు. సర్వీస్ అందించే క్రమంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ నగర కమిటీ ఆధ్వర్యంలో డ్రైవర్స్‌కు వెల్ఫేర్ బోర్డ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆర్టీసీక్రాస్‌రోడ్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. శ్రీకాంత్ మాట్లాడుతూ.. కేరళ తరహా సవారి యాప్‌ను ప్రభుత్వమే రాష్ట్రంలో తీసుకురావాలని డిమాండ్ చేశారు. జనార్దన్, లక్ష్మణ్, కలీమ్, ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న కల్తీ వైన్‌ను చూపిస్తున్న ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రావు, సీఐ డి. రామకృష్ణ

90 లీటర్ల కల్తీ వైన్ స్వాధీనం

● **తయారు చేస్తున్న మహిళ అరెస్ట్**

ముషీరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కల్తీ వైన్ తయారు చేస్తున్న ఓ మహిళను ముషీరాబాద్ ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. 90 లీటర్ల కల్తీ వైన్ స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్ డి. రామకృష్ణ వివరాలు వెల్లడించారు. తార్నాక విజయపురి కాలనీకి చెందిన గెరాల్డిన్ మిల్స్(54) కొంతకాలంగా ఇంట్లో ద్రాక్ష పండ్లు, చక్కెరతో కల్తీవైన్ తయారు చేసి విక్రయిస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు మంగళవారం తెల్లవారు జామున ఆమె ఇంట్లో తనిఖీ చేశారు. 112 బాటిళ్లలో నింపిన 90 లీటర్ల కల్తీ వైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిని రిమాండ్‌కు తరలించారు. ఆమె గతంలో కూడా కల్తీ వైన్ తయారు చేసి అరెస్ట్ అయిందని ఎక్సైజ్ పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో జీహెచ్ఎంసీ ఉద్యోగికి గాయాలు

బర్కత్‌పుర, జూలై 9 (ఆంధ్రజ్యోతి): వేగంగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో జీహెచ్ఎంసీ స్వీపర్‌కు తీవ్రమైన గాయాలయ్యాయి. కాచిగూడ అడ్మిన్ ఎస్ఐ కె. సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. మౌలానా ఆజాద్‌నగర్‌లో నివసిస్తున్న సుదర్శన్(55) జీహెచ్ఎంసీలో స్వీపర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం 5 గంటల సమయంలో వాకింగ్‌కు వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన ద్విచక్రవాహనం అతడిని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన సుదర్శన్‌ను ఆస్పత్రికి తరలించారు. అతడి కుమారుడు లోకేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాలాలో చెత్తాచెదారం తొలగింపు

నల్లకుంట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పాత రామాలయం వీధిలో నాలాలో చెత్తాచెదారాన్ని తొలగించారు. నల్లకుంట సిటిజన్స్ అసోసియేషన్, హైదరాబాద్ జిందాబాద్ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు నాలా సమస్యపై జీహెచ్ఎంసీ కమిషనర్, జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో మంగళవారం అధికారులు చెత్తాచెదారంతోపాటు, పూడికతీత పనులను చేపట్టారు. తొలగించిన చెత్తను అక్కడి నుంచి తరలించారు. జీహెచ్ఎంసీ ఈఈ వీర్రాజు, ఏఈ దివ్యతేజ పనులను పరిశీలించారు.

సిద్దప్ప వరకవి రాజయోగికి నివాళి

రాంనగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): అఖిల భారతీయ కుమ్మర శాలివాహన ప్రజాపతి కుంభకార్ మహా సంఘ్, తెలుగు భాషా చైతన్య సమితి సంయుక్తాధ్వర్యంలో సిద్దప్ప వరకవి రాజయోగి జయంతోత్సవం మంగళవారం నిర్వహించారు. తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ ఎన్. బాలాచారి సిద్దప్ప వరకవి రాజయోగి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రముఖ కవి రామకృష్ణ చంద్రమౌళి, నాయకులు కటకం నర్సింగ్‌రావు, బడేసాబ్, డాక్టర్ రాధాకుసుమ, రాజగోపాల్‌నాయుడు, మంగళంపల్లి శ్రీహరి, సిలివేరు శంకర ప్రజాపతి పాల్గొన్నారు.



సిద్దప్ప వరకవి రాజయోగి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రామకృష్ణ చంద్రమౌళి తదితరులు

నేటి నుంచి స్కిల్ ఎడ్యుకేషన్ మేళా

బర్కత్‌పుర, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 10 నుంచి 17వ తేదీ వరకు ఆన్‌లైన్ స్కిల్ ఎడ్యుకేషన్ మేళా నిర్వహిస్తున్నామని అకాడమీ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ సాయి శ్రీమాన్‌రెడ్డి తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, డిప్లొమా, ఇంజనీరింగ్ చదువుతున్న అభ్యర్థులు మేళాలో పాల్గొనవచ్చన్నారు. వివరాలకు 9505800050 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చని సూచించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్ డివిజన్ పరిధిలో బుధవారం విద్యుత్‌సరఫరా ఉండదని సీబీడీఏడీఈ విజయభాస్కర్ తెలిపారు. ఆప్కో ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి 11.45 వరకు, గాంధీకుటీర్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

'వ్యవసాయ ఉద్యోగుల బదిలీలు చేపట్టాలి'

రాంనగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జీవో నంబర్ 317 ప్రకారం వ్యవసాయ ఉద్యోగుల బదిలీలు చేపట్టాలని వ్యవసాయ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వైద్యనాథ్ కోరారు. మంగళవారం ప్రభుత్వ ముఖ్య సలహాదారుడు వేణుగోపాల్‌రావును కలిసి వ్యవసాయ ఉద్యోగుల సమస్యలను వివరించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు కార్పొరేషన్‌కు

చైర్మన్, డైరెక్టర్లను నియమించాలి

చిక్కడపల్లి,జూలై 9(ఆంధ్రజ్యోతి):మున్నూరుకాపు కార్పొరేషన్‌కు చైర్మన్, డైరెక్టర్లను నియమించాలని మున్నూరుకాపు యువజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆరె దశరథం ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం సాయంత్రం చిక్కడపల్లిలో సంఘం సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. కాపుల అభ్యున్నతి కోసం పనిచేస్తున్న వారినే చైర్మన్, డైరెక్టర్‌లుగా నియమించాలన్నారు. సమావేశంలో ప్రధానకార్యదర్శి మహేందర్, సంఘం సభ్యులు జంగిల్ నిఖిల్, అఖిల్, అశోక్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

వీసా ఇప్పిస్తామని మోసం

యూసుఫ్‌గూడ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): వీసా ఇప్పిస్తామని ఇద్దరు మహిళలను మోసం చేసిన వ్యక్తిపై మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎల్లారెడ్డిగూడకు చెందిన ఫ్యాషన్ డిజైనర్ వి.భార్గవి, ఆమె స్నేహితురాలు భోపాల్‌కు చెందిన సినీఆర్టిస్ట్ జయారావుకు ఈనెల 7 నుంచి 9 తేదీ వరకు అమెరికాలో ఈవెంట్‌కు రావాలని ఆహ్వానం అందింది. వీరికి వీసా లేకపోవడంతో తమ స్నేహితురాలు ఉషను కలిశారు. ఆమె మణికంఠరెడ్డి అనే వ్యక్తిని పరిచయం చేసి తమ కుటుంబానికి వీసా ఇప్పించారని, మోసం చేసే వ్యక్తి కాదని చెప్పింది. దీంతో వారిద్దరూ రూ. 52 వేలు మణికంఠరెడ్డికి ఆన్‌లైన్‌లో ట్రాన్స్‌ఫర్ చేశారు. నగదు తీసుకున్న తరువాత అతడు స్పందించకపోవడంతో బాధితులు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కావ్యా కిషన్‌రెడ్డి

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే

సాధికారత సాధ్యం : కావ్యా కిషన్‌రెడ్డి

బర్కత్‌పుర, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే సాధికారిత సాధ్యమవుతుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సతీమణి కావ్యారెడ్డి అన్నారు. మంగళవారం బర్కత్‌పురలో బీజేపీ నగర కార్యాలయంలో అటల్ బిహారీ వాజ్‌పేయి(ఏబీవీ) ఫౌండేషన్ స్కిల్ సెంటర్ల ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలో 16 కుట్టు శిక్షణ కేంద్రాలు నడుస్తున్నాయని, ఇప్పటి వరకు దాదాపు 20 వేల మంది మహిళలు, యువతులు, విద్యార్థినులు శిక్షణ పొందారని తెలిపారు. రాబోయే రోజుల్లో ఈ స్కిల్ సెంటర్లను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ నీరజ తదితరులు పాల్గొన్నారు.



కళాకారులకు సర్టిఫికెట్లు అందజేసిన రాంచందర్‌రావు

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

రాంనగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): శృంగేరి శంకరమఠం సౌజన్యంతో ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్, శ్రీవాణి నృత్యనికేతన్, నంది కళాక్షేత్రం సంయుక్తాధ్వర్యంలో మంగళవారం నల్లకుంటలోని శృంగేరి శంకరమఠంలో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్సీ ఎన్. రాంచందర్‌రావు, ప్రముఖ కవి రఘుశ్రీ, మాడుగుల నాగ గురునాథ్‌శర్మ, పాలపర్తి సంధ్యారాణి పాల్గొన్నారు. రాంచందర్‌రావు కళాకారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేసి అభినందించారు.

తెలంగాణ ఉద్యమంలో ఉద్యోగుల పాత్ర కీలకం

● **ప్రొఫెసర్ కోదండరాం**

రవీంద్రభారతి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమంలో ఉద్యోగుల పాత్ర కీలకమైనదని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. మంగళవారం లలితకళాతోరణంలో టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో యూనియన్ కేంద్ర సంఘం నూతన అధ్యక్షుడు మారం జగదీశ్వర్, నూతన ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.హుస్సేన్(ముజీబ్)కు ఆత్మీయ సత్కారం నిర్వహించారు.

ముఖ్య అతిథిగా పాల్గొన్న కోదండరాం మాట్లాడుతూ.. మలిదశ ఉద్యమంలో ఉద్యోగుల పాత్ర మరువలేనిదన్నారు. సకలజనుల సమ్మె ఉద్యమానికి ఊపునిచ్చిందని అన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగులను విస్మరించిందని అన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అధ్యక్షుడు ఎల్లారి శ్రీనివాసరావు, వివిధ జిల్లాల అధ్యక్షులు, జిల్లా కార్యదర్శి ఎస్.విక్రమ్‌కుమార్ పాల్గొన్నారు.



జగదీశ్వర్, డాక్టర్ ఎస్ఎం. హుస్సేన్‌ను సత్కరిస్తున్న ప్రొఫెసర్ కోదండరాం

సాహితీమూర్తులకు స్వరనీరాజనం

రవీంద్రభారతి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తున్న సాహితీమూర్తులకు స్వరనీరాజనం పలకడం అభినందనీయమని ఐఏఎస్ విశ్రాంత అధికారి డా. కేవీ రమణాచారి అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో లిటిల్ మ్యూజీషియన్స్ అకాడమీ రజతోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాహితీమూర్తులకు స్వరనీరాజనం పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. గాయనీ గాయకులు శాస్త్రీయ, సినీ గీతాలను ఆలపించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రమణాచారి గాయనీ గాయకులను సత్కరించి అభినందించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ.. లిటిల్ మ్యూజీషియన్స్ అకాడమీ ఆధ్వర్యంలో విభిన్నమైన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. సాహితీమూర్తులను కీర్తిస్తూ సంగీత విభావరి నిర్వహించాలనే ఆలోచన గొప్పదని, కళలను, కళాకారులను కాపాడుకునే ప్రయత్నం జరగాలని పేర్కొన్నారు. ఇలాంటి వేడుకల ద్వారా ఈతరం కళాకారులకు పూర్వీకుల గురించి తెలిసే అవకాశం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, తిరుమల శ్రీనివాసాచార్య, పి.వి. సాయిబాబా, ఉదయశంకర్, ఓలేటి పార్వతీశం, సుధామ, భవానీదేవితో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



సాహితీవేత్తలను సత్కరించిన రమణాచారి తదితరులు

